# కేసబియాంకా!

చెన్నపట్నం వెళదామని రైల్వేస్టేషన్ చేరాను. అప్పుడే మూడోగంట మ్రోగడం గార్డు ఈల ఊదడం అయిపోయింది. చచ్చాను! టిక్కెట్టు కొనేందుక్కూడా వ్యవధిలేదే? టిక్కెట్టు మాట దేవుడెరుగు. ఇహ ఆలోచిస్తే లాభంలేదని హుటాహుటిగా పరుగు లంకించు కున్నాను.

హమ్మయ్య! కంపార్టుమెంటులో పడ్డాను. రైలు కదిలింది. కదలనివ్వండిః నేను కంపార్టుమెంటులో పడ్డాక కదిలితేనేం?

నేను కూర్చుందికి ఎక్కడా స్థలం లేదు. చుట్టూ కలయజూశాను, ఎక్కడైనా ఒక కొద్దిజాగా ఈ చిన్ని కళేబరానికి దొరుకుతుందేమో నని, కానీ, లేదుః సన్నగా, అస్థిపంజరంలా ఉండే నాకే జాగా లేదుః మా ఆవిడ ఇప్పటికీ అంటూంటుంది. తను చదువుకునే రోజుల్లో నాతోనే గాని వివాహం అయివుంటే, లేబొరేటరీలోని అస్థిపంజరానికి బదులు నన్ను కూర్చోబెడితే బావుండేదని!

ఇంకా బాగా పరిశీలించి ప్రయాణికుల మొహాలు చూశాను. అందరూ నాకుమల్లే వస్తాదులే! పాపం, ఎవ్వరికీ శరీరాల్లో రక్తంలేదు! ఒకాయన దుక్కలా ఉన్నాడుకాని ఒంట్లో శక్తిలేదు. అస్తమానం ఆయాసమే! గర్భిణీస్త్రీ తంతు! నిజమే మరి, అమోనియాపిండి తిండితినే మనుషులెట్లా ఉంటారు? ఇద్దరు ముగ్గురు పాపల్ని చూశాను. హరహరా! వాళ్ళ దుర్దశ అసలే వర్ణించలేము. సూక్ష్మంగా చెప్పాలంటే జమ్మివారి 'లివర్ క్యూర్' బొమ్మ జ్ఞప్తికి తెచ్చుకోండి! వీళ్ళేనా బాబూ, రేపు శాసన సభాసభ్యులై మనల్ని శాసించే ప్రబుద్ధులు?

"ఇలా వచ్చి కూర్చోండి. ఎలాగో సర్దుకుందాం!" అని పిలుపు!

అతనివైపు చేశాను. 'అమందానంద కందళిత హృదయారవిందుండై' అనే మన ప్రాచీనకవుల సమాసంవలె ఆయన సహృదయతకు మనస్సులోనే నమస్సు లర్పించాను.

నాకు నమ్మకం ఉంది సుమండీ! మనదేశం దగాలూ కుట్రలూ కుచ్చితాలతో ఎంత ప్రబలిపోయి ఉన్నా, ఇక్కడా అక్కడా, ఈ కోనా ఆ కోనా ఏకోననో ఇసుమంత న్యాయం అంటూ ఉన్నదని.

వెనకటికి ద్రౌపదిని వివస్త్రను జేసి, అవమానిస్తున్నప్పుడు - ధర్మాధర్మాలూ, న్యాయాన్యాయాలూ ఎరిగిన హేమాహేమీలు జగజెట్టులే నోరుపెగలక మౌనం ధరించినప్పుడు, ఒకే ఒక బుడుతడు ఉపకర్ణుడు లేచి 'ఇది అక్రమం! అన్యాయం! ఒక అబలను ఇల్లా అవమానించడం దుర్మార్గం!' అని గర్జించలేదూ?

వెళ్ళి, నన్నాహ్వానించిన మహాభాగుని ప్రక్కనే కూర్చున్నాను. ఆయన చిరునవ్వుతో అన్నాడు: "తొందరగా ఎక్కేశారు. పాపం టిక్కెట్టు కొనడానికి టైము లేకపోయిందనుకుంటాను."

"ఔనండీ!.... మరి మీరు?" అన్నాను. నా తెలివితక్కువగా, నేను టిక్కెట్టు కొనలేనంత మాత్రాన, అతనూ కొనివుండడనే అనుమానం నా కెందుక్కలగాలి? దీనికే మనవాళ్ళంటారు. 'పచ్చకామెర లున్నవాడికి లోకమంతా పచ్చగా కనుపిస్తుం'దని! దొంగ వెధవకే ఎదుటివాడు దొంగేమోనని అనుమానం!

"నాక్కూడా మీ పరిస్థితే! టిక్కెట్టు దొరకలేదండీ! రోజూ లేటవుతూంది కదా, నెమ్మదిగా స్టేషన్‌కి చేరవచ్చునని ధీమాగా నడిచాను. వెధవరైలు రైట్టయిముకి వచ్చేసింది! పోనీండి, వచ్చేది విజయవాడస్టేషనూ! పెద్ద జంక్షనూ! ఒక ఘంటసేపు రైలు ఆగుతుంది. అక్కడదిగి, టిక్కెట్టు కొనుక్కోవచ్చులెండి."

"సరే అలాగే చేద్దాం" అని ఒప్పుకున్నాను నేను. అయ్యో! విజయవాడ వచ్చేసింది. ఎంత సేపట్లో రావాలి? చచ్చీ చావడంతోనే స్వర్గస్థుడయ్యా డంటున్నామే! చచ్చినక్షణంలోనే, ఎక్కడో, ఎంతదూరంలోనో, అందువిడిగా లేనంత ఎత్తునఉన్న స్వర్గానికే మనిషి చేరి పోతున్నప్పుడు ప్రక్కనున్న విజయవాడ చేరడం ఎంతసేపు?

ప్రయాణికులు ఎక్కేవాళ్ళెక్కుతున్నారు. దిగేవాళ్లు దిగుతున్నారు. "కాఫీ తాగివచ్చేస్తాను. సామాను కొంచెం ఓ కంట కనిబెట్టండి" అని ప్రక్కవాళ్ళకు

అప్పగించి, కాఫీ పుచ్చుకుందికి దిగుతున్నారు కొందరు.

"నేను వెళ్ళి టిక్కెట్లు తీసుకొస్తాను. డబ్బివ్వండి. మీరుంటారా ఇక్కడ?" అన్నాడతను.

చచ్చాను! ముక్కూమొహం ఎరగని పెద్దమనిషికి, టిక్కెట్టుకొనమని డబ్బు చేతిలో పెట్టేస్తే, ఆయన తిరోహితుడైతే?

నేను కొంచెం అనుమానాస్పదంగా, బుర్ర గోక్కుంటున్నట్లు నటించాను.

అతనోక మనస్తత్వవేత్తలా ఉన్నాడు, నా ముఖకవళికల్ని గమనించాడు.

"ఫరవాలేదు. మీరు అనుమానించ నక్కరలేదు. ఈ సామానునాదే. ఈ పెట్టె బెడ్డింగూ, మీదనున్న ఆ పెద్దగోనె బస్తా మూడు శాల్తీలూ నావే. జాగ్రత్తగా కనిబెట్టండి. ఏ మాత్రం పరధ్యానంగా ఉన్నా, మన సామాను మనకు దక్కదు!" అని హెచ్చరించాడాయన.

బ్రతుకు జీవుడా! ఇహ నేను సందేహించనవసరం లేదని జేబులోంచి ఇరవై రూపాయలు తీసిచ్చాను. ప్రస్తుతం నేనతన్ని అనుమానించడం తప్పే అనుకోండి. కానీ ఏం చెయ్యమంటారు? ప్రపంచం అట్లావుంది. ఘరానాగా కనిపించే గజదొంగలు అసంఖ్యాకంగా ఉండడంవలన, నిజమైన పెద్దమనుషుల్ని కూడా అనుమానించే దుస్థితి ఏర్పడ్డాది.

"ధనాపేక్ష వదలండి! సంసారం మీద వ్యామోహం వీడండి! కామక్రోధ లోభమోహ మదమత్సరాలనే అరిషడ్వర్గ శత్రువులు మనలో ఉన్నారు. వారిని భక్తివైరాగ్యాలనే శస్త్రాస్త్రములచే తెగనరకండి!" అని తత్వబోధగావించే సాధుపుంగవులే, ఏకాంత సమయం చూచి ఏకాంత చెయ్యో పట్టుకుంటున్నారు. వీళ్లైతే కాషాయవస్త్రాలమధ్య జేబులో భద్రపరచిన చాకుతీసి, ఖూనీలు చేసేసి నగలూ అవీ తస్కరిస్తున్నారు. ఇట్టి కుహనాభైరవులుండ బట్టే కదా, నిజమైన యతులను, విరాగులను మనం అనుమానించవలసి వస్తున్నది?

అంచేత సత్యసంధులను కూడా అసత్యవంతులని నేను అనుమానిస్తున్నా నంటే, పరిస్థితుల ప్రభావమే కాని, నా తప్పుకాదని, నన్ను అపార్థం చేసుకోవలదని, మనవి చేసుకుంటున్నాను.

"మీ క్కావలసిన టిక్కెట్టు బేసిన్‌బ్రిడ్జికా, సెంట్రల్ స్టేషన్‌కా?" అడిగాడతను మళ్ళీ జనసమ్మర్దం మధ్యనుంచి "ఏంచేతనంటే నేనుమాత్రం

బేసిన్ బ్రిడ్జిలో దిగిపోతాను."

"నాకు సెంట్రల్‌కే తీయండి. నేను చేరవలసింది ప్రక్కనున్న వాల్టేక్సురోడ్డే!" అని బిగ్గరగా అరచాను ప్రయాణికుల రణగుణధ్వనిలో నామాట అతనికి వినిపించదేమోనని.

అతను ప్రయాణికుల ప్రవాహంలో కలిసి పోయాడు. పావుగంట అయింది. అతను రాలేదు. ఇంతట్లో, ఎవరో ఇంకొక ప్రయాణికుడు వచ్చి, నాకు అప్పగించబడ్డ సామానులలో, పెట్టెమీద కూర్చోబోతున్నాడు. వెంటనే నేనతన్ని వారించి - "అయ్యా! దయచేసి ఆ పెట్టెమీద కూర్చోకండి! అందులో గాజువస్తువులుంటే విరిగిపోతాయి" అన్నాను నమ్రకంఠంతోనే.

"ఫరవాలేదు, అందులో గాజుసామాను లేదులెండి!" అంటూనే మంజూషపీఠాన్నలంకరించాడతను!

అదేమిటి? అందులో గాజుసామానేదీలేదని ఈయన కెలా తెల్సు? అయినా ఇతనేదో మొఱియావాడిలా ఉన్నాడనుకొని - "బాబ్బాబూ! దాని మీంచి లేవండి! ఆ పెట్టెతాలూకు యజమాని నాకు దీన్ని అప్పజెప్పి వెళ్ళారు. ఆయన వచ్చిచూస్తే, ఆగ్రహిస్తారు!" అన్నాను ఇంకా బ్రతిమాలుతున్న కంఠంతోనే-

"ఎవడయ్యా పెట్టె యజమాని? ఆగ్రహించేదెవడు? వాణ్నిలా రమ్మను! తోలు వొలిచేస్తాను! నాదే యీ పెట్టె! నా పెట్టెమీద కూర్చోడానికి నాకు స్వేచ్ఛలేదేం?" అన్నాడతను కళ్ళెర్రజేసి.

నేను బిక్క చచ్చాను! అయితే, ఈ సామాను నిజంగా నాకు అప్పజెప్పినతంది కాదన్నమాట! అతను మోసగాడా? మరి నా ఇరవైరూపాయలు? లేక, ఇప్పుడు పెట్టె మీద కూర్చున్నతను కాని నన్ను బుకాయిస్తున్నాడేమో తనదని?

"నా కదంతా తెలియదు. నాకాయన అప్పజెప్పి వెళ్ళాడు. అతను వచ్చేక మీరూ మీరూ చూసుకోండి! ప్రస్తుతానికి మాత్రం పెట్టెమీంచి లేవండి. ఆయన టిక్కెట్లు కొనడానికి వెళ్ళారు!" అన్నాను కాస్త కఠోరంగా.

"అయితే ఉండండి. మీ పొగరు అణచేస్తాను!" అంటూ దిగివెళ్ళి, టిక్కెట్టు కలెక్టరుని తీసుకొచ్చాడతను- "ఇతనే సార్ టీసీగారూ! నా సామాను చూపిస్తూ, ఇంకెవరిదో అంటున్నాడు! ఇదిగో, నే బుక్ చేయించుకున్న లగ్గేజిరసీదు!"

ఇంకేముంది? టీసీగా రడిగేరు నన్ను. "ఏయ్ మిస్టర్! ఈ సామాను ఈయనదే! ఇంకెవరిదో అని దబాయిస్తున్నారు ఏమిటి? ఏదీ మీ టిక్కెట్టు చూపండి!" అన్నారు.

నేను తెల్లమొహం వేశాను.

"టిక్కెట్టు తీసుకురమ్మనే ఒకాయనకు ఇరవై రూపాయలిచ్చానండీ! అతనే, ఈ సామాను నాకు అప్పగించి, టిక్కెట్టు తీసుకొస్తానని వెళ్ళాడు. ఆయనింకా రాలేదు" అన్నాను దైన్యంగా దగాపడిన తమ్ముడిలాగ.

"టిక్కెట్టు లేందే, అసలు మీరు రైలెక్కడానికి వీల్లేదు. దిగండి! ఇప్పుడు మీ వద్ద, ఈ రైలు బయల్దేడలిన స్థలంనుంచి గమ్యస్థానం వరకూ అయ్యే టిక్కెట్టువిలువ వసూలుచేయవచ్చు. మీరేదో మోసపోయినట్లున్నారు గనుక, దయతలచి విడిచేస్తున్నాను. మర్యాదగా దిగండి!" అన్నారు టీసీగారు.

కిమ్మనకుండా దిగిపోయాను.

రైలు వెళ్ళిపోయింది.

నా దగ్గర ఇరవై రూపాయలు పుచ్చుకున్న నా సోదర ప్రయాణికుడు రాలేదు. వస్తాడనే నమ్మకం కూడా లేదు. అయినా, ఆశతో అలా ఎదురుతెన్నులు చూస్తూనే ఉన్నాను.

ఆశ అనేది అటువంటిది. అది లేకపోతే జీవించనే లేము. జీవన యాత్రలో ఎన్ని ఒడిదుడుకులున్నా, జీవితపథంలో ఎన్నికంటకాలున్నా, ఎప్పటికైనా ఈ సుడులకడలికి ఆవలిఒడ్డు చూడకపోతామా అనే ఆశతోనే కదా మనం జీవించేది?

ఒక నావికుని కొడుకు కేసబియాంకా. తండ్రి యుద్ధానికి వెళుతూంటే, తనూ తండ్రితోనే వస్తానని మారాము చేశాడు. పాపం, పసికందుకి రణం అంటే మారణహోమం అని ఏం తెలుసు?

బాంబులు పేలుతున్నాయి. నావ అగ్నిజ్వాలలతో నిండిపోయింది. "అబ్బాయీ! నువ్విక్కడే ఉండు, నే వచ్చేదాకా ఎక్కడికీ వెళ్ళకు" అని చెప్పి, వెళ్లాడు నాన్న. నాన్న తిరిగీ రాలేదు. జ్వాలలు మిన్నుముట్టాయి. నావ పూర్ణాహుతి అయ్యే స్థితిలో పడ్డాది. కేసబియాంకా అరచాడు- "నాన్నారూ! నే కదలవచ్చా ఇక్కణ్నుంచి? మంటల్లో కాలిపోతున్నాను. నాకు అనుజ్ఞ ఇవ్వరూ?"

నాన్న రాలేదు. ఇంకెక్కడి నాన్న? చచ్చీ వీరస్వర్గానికి వెళ్ళాడు. అవు

అడుగుజాడనే దూడ అనుసరించినట్లు కేసబియాంకా, మంటలలో తండ్రిని కలుసుకున్నాడు. అంతేకాని, తండ్రిమాట జవదాటకుండా అనుజ్ఞకై అలా వేచి ఉన్నాడు.

నా ఇరవై రూపాయల్ని, టిక్కెట్టు కొనేందుకు పట్టుకెళ్లిన మనిషి ఎప్పటికైనా తిరిగీ వస్తాడేమో అనే ఆశతో - కేసబియాంకాకు మల్లే, అలాగే ప్లాటుఫారంమీద నిలుచున్నాను!

• సాహితి •

సెప్టెంబర్ *1964*